నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ సంపుటి: 5 సంచిక: 134 గురువారం, 22 అక్టోబర్ 2026 పేజీలు -4 వెల : 3/-




## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థి ఖరారు



వరంగల్, **వాస్తవ తెలంగాణ** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని ఖరారు చేసింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను తమ అభ్యర్థిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ పేరు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.మరోవైపు, ఈ ఎన్నికల దృష్ట్యా వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను లక్ష్యంగా చేసుకుని ఎన్నికల కార్యాచరణను కవిత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాల సమన్వయం కోసం సయ్యద్ ఇస్మాయిల్‌ను ఎన్నికల కోఆర్డినేటర్, అబ్జర్వర్‌గా నియమించారు కవిత. ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. దసరా సందర్భంగా అభ్యర్థి ప్రకటనతో పాటు ఎన్నికల బాధ్యతలనూ తెలంగాణ రక్షణ సేన ఖరారు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రానున్న రోజుల్లో పట్టభద్రుల మద్దతు కూడగట్టేందుకు పార్టీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది, అభ్యర్థి ప్రచారాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారన్నది మరింత ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రక్షణ సేన నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పేరు ఖరారు కావడంతో వరంగల్-ఖమ్మం-నల్లగొండ రాజకీయాల్లో ఈ ప్రకటన చర్చనీయాంశంగా మారింది.

## ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు



ములుగు, **వాస్తవ తెలంగాణ** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగి, వర్షాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో గత ఆరు నెలలుగా వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బుధవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పరిధిలోని రామప్ప చెరువు, అక్కడి డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామప్ప చెరువులో ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందని తెలిపారు. గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేసి చెరువులు, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా మెరుగుపరిచే అవకాశాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. నీటి నిల్వలు పెరిగేందుకు ఏటా ఇచ్చే విరామాన్ని దృష్టిలో ఉంచుకుని, మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు. రామప్ప నుంచి నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## పారా ఆసియా క్రీడల్లో భారత్ జోరు.. ఖాతాలో 54 పతకాలు



ఢిల్లీ,**వాస్తవ తెలంగాణ**జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. తాజాగా పారా అథ్లెట్ సిమ్రాన్ టీ12 విభాగంలో 100 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో స్వర్ణం పతకం సాధించింది. సిమ్రాన్ మంగళవారం జరిగిన 200 మీటర్ల ఈవెంట్‌లోనూ పసిడి పతకం కైవసం చేసుకుంది. దీంతో ఈసారి ఆమె బ్యాక్ టూ బ్యాక్ రెండు స్వర్ణాలు అందుకోవడం విశేషం. మరోవైపు పురుషుల టీ47 విభాగంలో 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత అథ్లెట్ దిలీప్ స్వర్ణం గెలుచుకున్నాడు. ఇక పురుషుల 400 మీటర్ల టీ35/38 ఈవెంట్‌లో భారత అథ్లెట్ అకీరా నందన్ బానోతు రజతం సాధించాడు. 51.25 సెకన్లలో రేసును పూర్తి చేసింది రెండో స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ ఖాతాలో ఇప్పటివరకు 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్య పతకాలు చేరాయి. 54 పతకాలతో భారత్.. పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



# అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం



2027 నాటికి ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చర్యలు

పోలీస్ అమరవీరుల పరిహారం భారీగా పెంపు

హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా ₹10 లక్షలకు పెంపు

పోలీస్ అమరవీరుల సంస్మరణ సభలో సీఎం రేవంత్

పోలీస్ శాఖలో మరో 5వేల ఉద్యోగాల భర్తీ చేస్తాం

హైదరాబాద్, **వాస్తవ తెలంగాణ**

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమాజ రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమని, వారి కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేకపోయినా ప్రభుత్వం, పోలీస్ శాఖ, తెలంగాణ సమాజం అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ పోలీస్ శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, 2027 నాటికి శాఖలోని అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు సీఎం తెలిపారు. గతంలో కానిస్టేబుళ్లకు రూ.40 లక్షలుగా ఉన్న ఎక్స్‌గ్రేషియాను రూ.కోటికి పెంచామన్నారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు రూ.45 లక్షల నుంచి కోటి రూపాయలకు, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.1.25 కోట్లకు పెంచినట్లు వివరించారు. డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.50 లక్షల నుంచి రూ.1.50 కోట్లకు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు కోటి రూపాయల నుంచి రూ.2 కోట్లకు పెంచినట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు.

### పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యం..



పోలీస్ శాఖకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించామన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించి హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించినట్లు చెప్పారు. మారుతున్న నేర స్వభావానికి అనుగుణంగా పోలీస్ శాఖను ఆధునీకరిస్తున్నామని సీఎం తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూనే పోలీసులు మానవీయ దృక్పథాన్ని కొనసాగించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వ్యాప్తి యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు.

### మహిళల రక్షణకు మరిన్ని చర్యలు..



మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. షీటీమ్స్ సేవలను కొనసాగిస్తూ మహిళల రక్షణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. మహిళలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతను పెంచేందుకు ఈ ఏడాది మార్చిలో స్టాండ్ విత్ హర్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మహిళలు, చిన్నారులకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించేందుకు ఏప్రిల్‌లో స్పందన తక్షణ రక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని సూచించారు. మహిళల భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని సీఎం పిలుపునిచ్చారు. పోలీసుల క్రమశిక్షణే వారి బలమని, నిజాయితీనే గౌరవమని పేర్కొన్నారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.






# త్యాగధనుల సేవలు చిరస్మరణీయం!

**ప్రజల రక్షణలో ప్రాణాలర్పించిన అమరులకు ఘన నివాళి.**
**మెదక్ జిల్లాలో 14 మంది పోలీసుల ప్రాణత్యాగం.**
**సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**





**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అమరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావుతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లోనూ భాగస్వాములవుతున్నారని చెప్పారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సైబర్ నేరాలను ఛేదిస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. అమరవీరుల స్ఫూర్తితో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 14 మంది పోలీసులు సంఘ విద్రోహ శక్తుల చేతుల్లో ప్రాణాలర్పించి అమరులయ్యారని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం వారు చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అమరవీరుల కుటుంబాల త్యాగాలను సమాజం గుర్తించాలని, వారికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజలకు భరోసా కల్పించడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు కలెక్టర్, ఎస్పీ గిఫ్ట్ ప్యాక్‌లు అందజేశారు. సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ కు దసరా శుభాకాంక్షలు - తెలియజేసిన గుమ్మడిదల నాయకులు



గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్: దసరా పండుగను పురస్కరించుకొని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నీ గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి వార్డు కౌన్సిలర్లు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

**వృద్ధులకు నూతన వస్త్రాలు, రోగులకు పండ్ల పంపిణీ**




శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్; శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ చాకలి అశోక్, 11వ వార్డు కౌన్సిలర్ సమీయోద్దీన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు మహారాజ్‌పేట్‌లోని జాయ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ ఆయురారోగ్యాలతో ఉండి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అమ్మవారి శోభాయాత్ర

**భజనలు, భక్తిగీతాలు, డీజే నినాదాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపు**
**పెద్ద చెరువు కట్ట వద్ద గంగమ్మ ఒడిలో అమ్మవారి నిమజ్జనం**



**తూప్రాన్, అక్టోబర్ 21. వాస్తవ తెలంగాణ ప్రతినిధి:** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో దుర్గాభవాని సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ దుర్గాభవాని అమ్మవారి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర భక్తిభావంతో, ఆధ్యాత్మిక శోభతో అంగరంగ వైభవంగా సాగింది. తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న అమ్మవారిని పదో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించి, పెద్ద చెరువు కట్ట వద్ద గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని మహంకాళి దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు. అక్కడి నుంచి పాత మున్సిపల్ కార్యాలయం, నూతన మున్సిపల్ కార్యాలయం, హైస్కూల్, శివాలయం మీదుగా అమ్మవారి ఊరేగింపు సాగింది. అనంతరం సినిమా థియేటర్ రోడ్డు, వినాయక్ నగర్, గాంధీనగర్ మెయిన్ రోడ్డు మీదుగా పెద్ద చెరువు కట్ట వరకు శోభాయాత్ర కొనసాగింది. అమ్మవారి శోభాయాత్రలో భజన బృందాల భక్తి గీతాలు, డీజే సౌండ్‌లతో మార్మోగిన ఆధ్యాత్మిక నినాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత అమ్మవారి మాలధారణతో భక్తిపారవశ్యంలో పాల్గొనగా, భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధులన్నీ అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. భక్తుల జయజయధ్వానాల మధ్య సాగిన ఊరేగింపు పట్టణ ప్రజల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన భక్తులు, ఉత్సవాల ముగింపు రోజున ఘనంగా శోభాయాత్ర చేపట్టి సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం పెద్ద చెరువు కట్ట వద్ద గంగమ్మ ఒడిలో అమ్మవారిని నిమజ్జనం చేయడంతో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి.అలాగే మున్సిపల్ మాజీ చైర్మన్ మామిండ్ల కృష్ణ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ రామరాజు, వెంకట గోపాలకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, రిటైర్డ్ ఎస్సై విద్యాసాగర్, రిటైర్డ్ వార్డెన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్లతో శోభాయాత్ర విజయవంతంగా ముగిసింది.

# దసరా పండుగ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య ను కలిసిన శంకర్ పల్లి కాంగ్రెస్ నాయకులు



శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;దసరా పండుగను పురస్కరించుకుని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి, మొకిలా పీఏసీఎస్ చైర్మన్ గౌండ్రా సత్యం, గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్, గోపులారం సర్పంచ్ తంగడపల్లి రవీందర్ రెడ్డి, మొకిలా సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్, వార్డు సభ్యులు తదితరులు ఎమ్మెల్యేను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కొద్దిసేపు ముచ్చటించి, దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. నాయకుల పరస్పర కలయికతో పండుగ వాతావరణం నెలకొంది.

# ప్రతి మహిళ దుర్గాదేవిలా హిందూ సంస్కృతిని దేశాన్ని రక్షించాలి..

**నిమజ్జనం సందర్భంగా భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ**



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** ఆనాడు రాక్షసుల సంహారంతో దేశ ప్రజలను కాపాడిన దుర్గాదేవి శక్తి ల నేటి మహిళలు సనాతన ధర్మాన్ని అలాగే సమాజంలోని దుష్టశక్తులను తుదముట్టించాలని శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగరెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్ నరేష్ కుమార్ ( సతీష్ కుమార్) పేర్కొన్నారు. గత తొమ్మిది రోజులుగా దేవి నవరాత్రుల పూజల అనంతరం బుధవారం నాడు జరిగిన నిమజ్జనం కార్యక్రమాన్ని పురస్కరించుకొని శంకరపల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలను తక్కువ చేసి హింసించేందుకు ఆనాడు ప్రయత్నించిన రాక్షసుల భరతం పట్టిన అమ్మవారి శక్తి లోకానికి తెలిసినట్లు ఇటీవల పాకిస్తాన్ శత్రువులు అమాయక స్త్రీలను చంపిన సంఘటనను ఇప్పి కొట్టిన మన దేశ ఆర్మీ కర్నాల్ అధికారి సోషియా కు రిషి అలాగే వింగ్ కమాండర్ యోగితా సింగ్ సింధూర్ ఆపరేషన్ పేరిట తీవ్రవాదులను చంపి భారత సరిహద్దుల్లోకి వచ్చిన సాహసాన్ని నరేష్ కుమార్ గుర్తు చేశారు. కాబట్టి స్త్రీలను తక్కువ చేసి చూడొద్దన్నారు. ఈ దేవీ నవరాత్రుల వల్ల ఒకపక్క సైన్స్ మరోపక్క ఆధ్యాత్మికత గొప్పతనాన్ని స్పష్టం చేసిందన్నారు. ఇలాంటి హిందూ సాంప్రదాయ పండుగలను మనమందరం భక్తి శ్రద్ధలతో చేసుకోవాలన్నారు.

# బుల్కాపురం కాళీమాత ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదం.. గొర్రెలు మృతి



శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్; హైదరాబాద్ రోడ్డు నుంచి శంకర్‌పల్లి మీదుగా వెళ్లే మార్గంలో బుల్కాపురం కాళీమాత ఆలయం సమీపంలో ఫార్చ్యూనర్ కారు గొర్రెలను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో సుమారు 15 నుంచి 20 గొర్రెలు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రమాదానికి కారణమైనట్లు భావిస్తున్న ఫార్చ్యూనర్ కారు స్థానిక గ్రామానికి చెందినదిగా గుర్తించినట్లు తెలుస్తోంది. కారు అత్యంత వేగంగా వచ్చిందని, డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని సమాచారం. అయితే కారు వేగం, డ్రైవర్ మద్యం సేవించిన విషయం, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల సంఖ్య, వాహనం వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

## శంకర్‌పల్లిలో మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు.. వృద్ధులకు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



**శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లిలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని మహారాజ్‌పేట జాయ్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నివసిస్తున్న వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సైతం నూతన దుస్తులు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవతో పాటు సామాజిక బాధ్యతగా పేదలు, వృద్ధులు, పారిశుద్ధ్య కార్మికులకు అండగా నిలవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టేక్మాల్ మండల వాప్తంగా లో ఘనంగా దసరా వేడుకలు



**వాస్తవ తెలంగాణ టేక్మాల్ న్యూస్** టేక్మాల్: టేక్మాల్ మండలం లో మంగళవారం జరిగిన విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. సంప్రదాయం ప్రకారం జమ్మి పూజలు నిర్వహించి ఒకరికొకరు జమ్మి ఆకులు ఇచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది. ప్రజలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.టేక్మాల్ స్కూల్ గ్రాండ్ లో ఏర్పాటు చేసిన జంబీ చెట్టు వద్ద మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తిమిగారి సుధాకర్ ఉప సర్పంచ్ శంకరయ్య జంబీ చెట్టుకు పూజలు చేశారు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## కె సి ఆర్, కేటీఆర్ ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్ పల్లి అక్టోబర్ 21 (వాస్తవ తెలంగాణ )** కూకట్ పల్లి దసరా పండుగ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కె సి ఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కె సి ఆర్, కేటీఆర్ కి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తో పాటు కూకట్ పల్లి నియోజకవర్గం బి ఆర్ యస్ పార్టీ కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు కె టి ఆర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కి దసరా శుభాకాంక్షలు తెలిపిన డా. సత్యం శ్రీరంగం



**కూకట్ పల్లి అక్టోబర్ 21 (వాస్తవ తెలంగాణ )** విజయ దశమి సందర్భంగా కుటుంబ సమేతంగా రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దంపతులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి ఈ పవిత్ర సందర్భాన ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, ఐశ్వర్యం కలగాలని మరియు మరిన్ని విజయాలు సాధించాలని దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియచేసిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

## పటాన్‌చెరులో అంగరంగ వైభవంగా దసరా వేడుకలు మహిషాసుర దహన కార్యక్రమంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాపటాన్‌చెరు ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గారి అధ్యక్షతన, శ్రీ మహంకాళి సేవా సమితి ఆధ్వర్యంలో మైత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన మహిషాసుర దహన కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. పటాన్చెరు జిహెచ్ఎంసి కార్యాలయం బుద్ధ విగ్రహం వద్ద ధ్వజపతాక ఆవిష్కరణ, కొత్త మార్కెట్ వద్ద షమీ పూజ నిర్వహించారు. ఈ వేడుకల్లో పటాన్‌చెరు పట్టణ ప్రముఖులు, పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మైత్రి క్రీడా మైదానం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా పటాన్‌చెరు పెద్దలు తరతరాలుగా కొనసాగిస్తున్న ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలు కూడా పాటించేలా ముందుకు తీసుకెళ్తామని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు వారసత్వంగా అందిస్తామని మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు

## దసరా సందర్భంగా జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యలమంచి ఉదయ్ కిరణ్



**మియాపూర్, అక్టోబర్ 21 (వాస్తవ తెలంగాణ):** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు పార్టీ నాయకులతో కలిసి పండుగ శుభాకాంక్షల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో జీవించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బేరి రాంచందర్ యాదవ్, గిరి, యాదన్న గౌడ్, ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి చంద్ర మౌళి, సతీష్, సాయి లోహిత్, శశి తదితరులు పాల్గొన్నారు.

## హైదర్‌నగర్‌లో వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు



**మియాపూర్, అక్టోబర్ 21 (వాస్తవ తెలంగాణ):** హైదర్‌నగర్‌లోని శ్రీ జయదుర్గా మైసమ్మ దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో బంగారు కిరీటం, స్వర్ణాభరణాలు, రంగురంగుల పట్టు వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పాలంకరణతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఉదయం సహస్ర కుంకుమార్చన, పూర్ణాహుతి, సాయంత్రం మహిళా భక్తులతో లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి 7 గంటలకు గుర్రపు బగ్గిపై అమ్మవారి ఊరేగింపు ప్రారంభమైంది. వివిధ దేవతల వేషధారణలు, మహిళల హారతులు, బ్యాండ్ మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల నిర్వహణలో ఆలయ అర్చకులు చందుస్వామి, నవీన్ స్వామి, ఋత్వికులు అజయ్ స్వామి, వినయ్ స్వామి, క్లర్క్ లక్ష్మణ్ తదితరులు సేవలందించారు. దాతలు శివశ్రీ లింగైక్య నేతి శ్రీశైలం కుటుంబ సభ్యులు అన్నప్రసాద సేవలకు సహకరించారు. త్రిశూల్ సేన వాలంటీర్లు, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది ఉత్సవాల నిర్వహణలో సహకరించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన ఈవో సతీష్ బాబు తెలిపారు. ఉత్సవాల విజయానికి సహకరించిన దాతలు, భక్తులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## పాల్వంచలో దుర్గాభవాని మాత శోభాయాత్ర



**(వాస్తవ తెలంగాణ):** టేక్మాల్ మండలం పాల్వంచ గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన దుర్గాభవాని మాత శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో ఈ శోభాయాత్ర గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.ఈ సందర్భంగా కాంతారా వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాంతారా వేషధారణలో కళాకారులు ప్రదర్శించిన వినూత్న రూపాలు, హావభావాలు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. శోభాయాత్రను తిలకించేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు.దుర్గాభవాని మాత నామస్మరణలతో, భక్తుల సందడితో శోభాయాత్ర ఘనంగా సాగింది. దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించరు.

# దసరా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

## చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి.. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, ధర్మానికి విజయద్వారంగా నిలిచే విజయదశమి పండుగను పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం సాయంత్రం మైత్రి స్టేడియంలో నిర్వహించిన దసరా వేడుకల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.పండుగ వేడుకల్లో భాగంగా తొలుత జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన షమీ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులతో కలిసి మైత్రి స్టేడియంలో నిర్వహించిన రావణాసుర దహన కార్యక్రమానికి హాజరయ్యారు. రావణాసుర దహనంతో చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు ప్రజల్లో పండుగ ఉ



త్సాహాన్ని నింపాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగ ధర్మం, ధైర్యం, న్యాయం, సత్యం వంటి సద్గుణాలకు ప్రతీక అని పేర్కొన్నారు. రావణాసుర దహనం మనలోని చెడు ఆలోచనలు, అహంకారం, అన్యాయాలను విడిచిపెట్టి మంచిని ఆచరించాలనే సందేశాన్ని అందిస్తుందని తెలిపారు.విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సరికొత్త విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే పండుగలను ప్రజలందరూ కలిసిమెలిసి జరుపుకోవడం మన సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

దసరా వేడుకలతో మైత్రి స్టేడియం పండుగ శోభను సంతరించుకోగా, రావణాసుర దహన కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు, ప్రజలు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

# పి ఏ సి చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ కి దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేట్

**కూకట్ పల్లి అక్టోబర్ 21 (వాస్తవ తెలంగాణ )** కూకట్ పల్లి అల్విన్ కాలనీ దసరా పర్వదిన శుభసందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ ని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మరియు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ లు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఖేడ్ కురుమ సంఘంలో అలాయ్ బలాయ్



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ కురుమ సంఘం అధ్యక్షుడు లొండే నర్సింలు అధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నారాయణఖేడ్ లో కురుమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కురుమ బంధువులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కురుమ ప్రజలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు అన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# బి టెక్ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేసిన బండి రమేష్

**కూకట్ పల్లి అక్టోబర్ 21 (వాస్తవ తెలంగాణ )** కూకట్‌పల్లిలోని శ్రీ హేమ దుర్గా భవన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం బండి రమేష్ సేవా సంస్థ ద్వారా విద్యార్థిని డి. వర్షిణికి కళాశాల విద్య కోసం రూ.15,000 (పదిహేను వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేసిన బండి రమేష్. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ బండి రమేష్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో బండి రమేష్ సేవా సంస్థ ద్వారా తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప ఆయుధమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివి తమ తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడటం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు.



# దసరా పండుగ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది కి చీరలు పంపిణీ చేసినా అక్కాల రూపా సురేష్



**(వాస్తవ తెలంగాణ )** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘాట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ శ్రీవేంకటేశ్వర కాలనీ అధ్యక్షులు సామాజిక కార్యకర్త అక్కల రూపా సురేష్ దసరా పండుగ సందర్భంగా ఈరోజు ఘట్‌కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీలో మున్సిపల్ మహిళా సిబ్బందికి చీరలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ మరియు వారి సతీమణి అక్కల రూపా పాల్గొని మహిళా మున్సిపల్ సిబ్బందికి చీరలు అందజేశారు.ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ మహిళా సిబ్బందిని గౌరవిస్తూ, దసరా పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని అక్కాల సురేష్ తెలిపారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నివాళులు

మెదక్ తూప్రాన్ వాస్తవ తెలంగాణ ప్రతినిధి బండ నాగరాజు యాదవ్ పోలీస్ అమరవీరుల సంస్మరణ : పురస్కరించుకుని మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద గల స్వర్గస్తులు డీఎస్పీ శ్రీ బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తూప్రాన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలను కొనియాడారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు జ్యోతి, యాదగిరి, పోలీస్ అధికారులు, సిబ్బంది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సదాశివపేట పట్టణంలోమాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు దసరా శుభాకాంక్షలు





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో విజయదశమి దసరా పండుగను పురస్కరించుకొని జహీరాబాద్ పార్లమెంట్ మాజీ సభ్యులు శివశ్రీ బీబీ పాటిల్ గారిని సదాశివపేటలోని శివరాజ్ పాటిల్ గారి నివాసంలో కలిసి సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ పెద్దలు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ పెద్దలు శివ చందర్ కుమార్ పాటిల్, గందిగా రాజు, అనిమిశెట్టి జయప్రకాశ్, వీర మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794

# సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు దసరా శుభాకాంక్షలు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదశివాపేట పట్టణంలోవిజయదశమి దసరా పండుగను పురస్కరించుకొని సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ గారిని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం వర్కింగ్ ప్రెసిడెంట్ అనిమిశెట్టి జయప్రకాశ్.ఈ సందర్భంగా దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలను అందించాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు.

# గుమ్మడిదల శివాలయంలో దుర్గాభవాని నిమజ్జన వేడుకలు

## అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్



**గుమ్మడిదల, వాస్తవ తెలంగాణ న్యూస్:** నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాభవాని నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దుర్గాభవాని అమ్మవారి కృపతో మున్సిపల్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, నాయకులు వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పురోహితులు రాము శర్మ, అమ్మవారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ మాదిగ ని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు..

## మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ నేతలు..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు లింగం సాయి మాదిగ, మండల ఉపాధ్యక్షులు దాసరి నాగేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు 'పద్మశ్రీ' మంద కృష్ణ మాదిగని మర్యాదపూర్వకంగా కలిసి బొకే శాలువతో సన్మానించి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ విజయదశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆనందంగా, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల జీవితాల్లో వెలుగులు

## చౌటకూర్ మండల అధ్యక్షుడు గణేష్ ముదిరాజ్.





**వాస్తవ తెలంగాణ** పేదల సొంతింటి కలకు భరోసా ఇందిరమ్మ ఇల్లు అని జోగిపేట వ్యవసాయ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి అన్నారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామానికి చెందిన కాగితాల జయమ్మ-విష్ణువర్ధన్ దంపతులకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేసింది. ఆరు నెలల పాటు నిర్మాణ పనులు పూర్తి కావడంతో బుధవారం గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. సొంత ఇంటి కల నెరవేరడం ప్రతి పేద కుటుంబానికి ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. సొంత ఇల్లు కుటుంబానికి భద్రతను కల్పించడమే కాకుండా, ఆత్మగౌరవంతో జీవించే దుకు దోహదపడుతుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సొంత ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలు ఎంతో తోడ్పాటునందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయి, లబ్దిదారులు తమ కొత్త ఇళ్లలో గృహ ప్రవేశాలు చేసుకోవడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోడటప్ల గణేష్ ముదిరాజ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు నందికంటి రామచంద్రారెడ్డి, సర్పంచులు పామెనొల్ల అంజమ్మ, గిరంగారి మల్లారెడ్డి, కార్యదర్శి సిద్ధమ్మ, నాయకులు రాములు, రాజశేఖర్, కాశీనాథ్, ఉపసర్ప మౌలనా, శ్రీనివాస్రెడ్డి, ప్రభాకర్రెడ్డి, భానుచందర్, విష్ణువర్ధన్రెడ్డి, పండరి, బానూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దసరా వేడుకల సందర్భంగా ప్రజలను కోరిన జగ్గారెడ్డి

## మీ కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్ ఉంటే.. రోజూ వాళ్లకు గోలీలు వేసి కాపాడుకోండిలి దేవుడిని మొక్కడానికి ముందే.. తప్పకుండా గోలీలు వేయాలని సూచించిన జగ్గారెడ్డి బీపీ, షుగర్ వున్న వాళ్ళ ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ద పెట్టి వారిని కాపాడుకోవాలని సూచన



**సంగారెడ్డి,వాస్తవ తెలంగాణ న్యూస్:** "ప్రతి రోజూ దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ ఉన్నవారు వైద్యులు సూచించిన విధంగా మందులు వేసుకోవాలి. ఇంట్లో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న తల్లిదండ్రులు ఉంటే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా కుటుంబ సభ్యులు శ్రద్ధ పెట్టాలి" అని జగ్గారెడ్డి ప్రజలకు సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కొడుకులు, కుమార్తెలు, కోడళ్లపై ఉందన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కుటుంబ బంధాలు, పెద్దల ఆరోగ్యం, సంగారెడ్డి ప్రజలతో తనకున్న అనుబంధం గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

**అంబరాన్నంటిన దసరా సంబురాలు**

సంగారెడ్డిలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలు ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిరం భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు.అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీగా తరలివచ్చిన ప్రజలు రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన బాణసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను కనువిందు చేశాయి.ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసింది.



**సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు**

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని, సంగారెడ్డి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన డబ్బును ప్రతి ఏటా సంగారెడ్డి ప్రజల కోసం పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఉన్నప్పుడు ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలే" అని పేర్కొన్నారు.దసరా వేదికను తాను ఎన్నడూ రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదన్నారు. "ఈ వేదికపై నుంచి నేను ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదు. ఓట్లు అడగలేదు. కానీ నా మనసులో ఉన్న మాటలను మాత్రం ప్రజలతో పంచుకుంటాను" అని చెప్పారు.

**సంగారెడ్డి ప్రజలంతా నా కుటుంబమే**

"కుటుంబం అంటే కేవలం నా భార్య, పిల్లలు మాత్రమే కాదు. సంగారెడ్డి ప్రజలందరినీ నా కుటుంబ సభ్యులుగానే భావిస్తాను. అందుకే ప్రతి ఏటా అందరితో కలిసి పండుగలు జరుపుకుంటాను" అని జగ్గారెడ్డి అన్నారు. వయసు పెరిగేకొద్దీ తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దలు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలన్నారు.

ఇంట్లో పెద్దల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, వారికి అవసరమైన సంరక్షణ అందించాలని కోరారు. కొడుకులు, కుమార్తెలతో పాటు కోడళ్లు కూడా కుటుంబంలోని పెద్దల ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాళ్లు, చేతులు పడిపోయిన తర్వాత ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేదన్నారు. పండుగలంటే కేవలం ఆటపాటలు, వినోదం మాత్రమే కాదని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పెంపొందించుకునే సందర్భాలని ఆయన వ్యాఖ్యల ద్వారా సందేశమిచ్చారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ జగ్గారెడ్డి చేసిన ప్రసంగం దసరా వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.

# హరీష్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఆదర్శ్ రెడ్డి

## పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ

**పటాన్‌చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** దసరా పండుగను పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ ఉపనేత హరీష్ రావును, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను నింపాలని ఆదర్శ్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డితో పాటు పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# టేక్మాల్‌లో వైభవంగా దుర్గామాత ఊరేగింపు



**వాస్తవ తెలంగాణ టేక్మాల్ న్యూస్** టేక్మాల్, బుధవారం: టేక్మాల్ లో బుధవారం దుర్గామాత ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గామాత ఊరేగింపు సందర్భంగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన జిన్నారం వెంకటేష్ గౌడ్

**ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానందతో కలిసి మర్యాదపూర్వకంగా భేటీ**





**హైదరాబాద్,వాస్తవ తెలంగాణ న్యూస్:** దసరా పండుగను పురస్కరించుకొని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)ను జిన్నారం వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానందతో కలిసి కేసీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధిని నింపాలని ఆకాంక్షించారు.

# పటాన్‌చెరులో ప్రముఖులను కలిసిన మాద్రి పృథ్వీరాజ్

**పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు**





**పటాన్‌చెరు, వాస్తవ తెలంగాణ న్యూస్:** దసరా పండుగను పురస్కరించుకొని మాద్రి పృథ్వీరాజ్ పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఉమ్మడి సంగారెడ్డి జిల్లా మాజీ ఎమ్మెల్యే సత్తన్న, మాజీ కార్పొరేటర్లు సపనదేవ్, శంకర్ యాదవ్, ప్రముఖులు మనోహర్ రెడ్డి, కుమార్ యాదవ్ (62) తదితరులను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని మాద్రి పృథ్వీరాజ్ ఆకాంక్షించారు. పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.

# బతుకుదెరువు కోసం వస్తే.. వలస కూలి పై దాడి!

**19 ఏళ్ల వలస యువకుడికి తీవ్ర గాయాలు ఖమ్మం తరలింపు**
**దాడి చేసిన వ్యక్తి పై పోలీస్ కట్టిన చర్య తీసుకోవాలి.. వ్యకాస డిమాండ్**

**వాస్తవ తెలంగాణ** సింగరేణి మండల పరిధిలోని మాణిక్యారం గ్రామంలో బుధవారం వలస కూలిపై దాడి చోటుచేసుకున్న ఈ ఘటనలో రాజు (19) అనే యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం..బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చి మాణిక్యారం ప్రాంతంలో కూలి పని చేసుకుంటున్న రాజు పై అదే గ్రామానికి చెందిన ఓ రైతు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన రాజు ను స్థానికులు వెంటనే కారేపల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకురాగా పోలీస్ వారు వివరాలు సేకరించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం,గాయాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్యం కోసం కారేపల్లి లో అంబులెన్సు అందుబాటులో లేక ఆటోలో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. పొట్టకూటి కోసం వస్తే.. దాడా? కారుకులపై కఠిన చర్య తీసుకోవాలి కొండబోయిన నాగేశ్వరరావుకుటుంబాన్ని పోషించుకునేందుకు సుదూర ప్రాంతం నుంచి వచ్చి కూలి పని చేసుకుంటున్న వలస కూలి రాజు (19) పై మాణిక్యరం గ్రామానికి చెందిన భూక్య కోటయ్య అనే రైతు. దాడి చేయడానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు ఆయన విలేకరులతో మాట్లాడుతూ తీవ్రంగా గాయపడిన రాజుని తీసుకొని ఘటనపై కారేపల్లి పోలీసులకు సహచర కూలీలు స్థానికులు ఫిర్యాదు చేయుటకు వస్తే కేసు నమోదు చేయకుండా. దాడికి పాల్పడిన రైతు ని స్టేషన్ కి రప్పించకుండా. గాయపడిన కూలిని హాస్పటల్ తీసుకెళ్లమని పోలీస్ శాఖ సలహా ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని. కూలి పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై విచారణ జరిపి దాడికి పాల్పడిన రైతుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు ఇతర రాష్ట్రాల నుండి వలస కూలీలని రప్పించుకొని వారికున్న ఆర్థిక పరిస్థితిని ఆసరా చేసుకుని. అతి తక్కువ కూలి ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకోవడమే కాకుండా ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని. గత కొద్దిరోజుల క్రితం కూడా సంబంధిత రైతు. వలస కూలి రాజు పై దాడి చేయగా అతను సంబంధిత వ్యక్తి దగ్గర కూలి పని మానివేసి మరొక రైతు వద్దకు వెళ్లి పనిచేస్తున్నాడని కుట్రతో తన వద్ద పని మానేశాడు కక్షపూరితంగానే దాడి చేసి తీవ్రంగా గాయపరచడం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖండిస్తుందని దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం పాటు



గాయపడిన రాజు వైద్య ఖర్చులు మొత్తమును దాడికి పాల్పడిన రైతు చెల్లించి మెరుగైన వైద్యం అందించేలా పోలీస్ వారు చర్యలు తీసుకొని భవిష్యత్తులో పేదలైన కూలీలపై దాడి లాంటి ఘటనలు నివారించాలని ఆయన కోరారు ఈ ఘటన ఖండించిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సింగరేణి మండల అధ్యక్ష కార్యదర్శులు కేశగాని ఉపేందర్ యనమనగండ్ల రవి తదితరులు ఉన్నారు

# పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం...జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్.

**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్మృతి పరేడ్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్.**



ఖమ్మం, అక్టోబర్-21 **వాస్తవ తెలంగాణ** పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు భరోసా, రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లోని పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్, పోలీస్ కమీషనర్, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరులను స్మరించుకుని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. జిల్లాకలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం లడక్ సరిహద్దు ప్రాంతంలో ప్రాణ త్యాగం చేసిన వీరుల స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది పోలీస్ శాఖ నిత్యం ప్రదర్శించే నిబద్ధత, త్యాగం, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో ప్రగతికి తోడుగా ప్రజలకు భరోసా, రక్షణ కల్పిస్తూ శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా ఈ సందర్భంగా స్మరించుకోవాలని తెలిపారు.

**మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక పోలీసింగ్ :**

ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు సహా కొత్త తరహా నేరాలు వెలుగు లోకి వస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీసింగ్ విధానాలను ఆధునీకరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధనలో పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం రెండు ముఖ్యమైన విభాగాలని, పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు.

**అమరవీరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తి:**

పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో చైనా సైనికులతో పోరాడుతూ దేశ సరిహద్దులను కాపాడే క్రమంలో 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. చివరి శ్వాస వరకు దేశ రక్షణ కోసం పోరాడిన వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించు కుంటున్నామని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాలను నియంత్రించడం వంటి బాధ్యతలను పోలీసులు నిరంతరం నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు తెలంగాణలో నక్సలిజం, తీవ్రవాద సమస్యలు తీవ్రంగా ఉండేవని, పోలీసుల నిరంతర కృషి, త్యాగాల ఫలితంగా ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లు శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా నలుగురు పోలీసు సిబ్బంది తమ ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు సంబంధిత ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు తెలిపారు.